క్లుప్తంగా

26న ఆర్డీఓ కార్యాలయం ముట్టడి

తిరువూరు: కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 26న ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. నాగేశ్వర రెడ్డి తెలిపారు. రైతు సంఘాలు, కౌలు రైతు సంఘాలు, కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండాపోయిందని, కార్మికుల సంక్షేమాన్ని కాలరాస్తూ కేంద్రం నల్ల చట్టాలను ప్రవేశపెట్టిందని విమర్శించారు. ఈనెల 26న జరుగనున్న ఆర్డీఓ కార్యాలయాల ముట్టడి కార్యక్రమంలో కార్మికులు, కర్షకులు పాల్గొనాలని కోరారు. పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కట్టలేరుపై వంతెన పునర్నిర్మించాలి

ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు

తిరువూరు: గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై వంతెన పునర్నిర్మించాలని ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అసెంబ్లీ సమావేశాల్లో కోరారు. శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాలను అనుసంధానం చేసే ఈ వంతెన గతంలో వరదలకు కొట్టుకుపోవడంతో తాత్కాలిక రహదారిపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని చెప్పారు. ఇటీవల వర్షాలకు వంతెన పక్కన చప్టా కూడా దెబ్బతిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వంతెన పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

మాలధారులకు అన్నదానం

మైలవరం: మైలవరంలోని ద్వారకా తిరుమల దత్తత దేవాలయం శివాలయం ప్రాంగణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పలు, భవానీ మాలధారులకు శనివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ సుంకర అక్కయ్య నాయుడు వితరణతో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావు కుమారుడు ఎస్వీఎన్ నివృతరావు భోజనాలు వడ్డించారు.

అనాథ బాలలకు ఆర్థికసాయం



తిరువూరు: స్థానిక ఐడియాస్ సేవా సంస్థలో ఆశ్రయం పొందుతున్న అనాథ బాలలకు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు శనివారం ఆర్థికసాయం అందజేశారు. బాలల విద్యాభ్యాసం, పుస్తకాల కొనుగోలు, దుస్తుల నిమిత్తం ఏడుగురికి ఈ ఆర్థికసాయాన్ని అందించారు. 28 సంవత్సరాలుగా ఐడియాస్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను కమిషనర్ అభినందించారు. ఐడియాస్ డైరెక్టర్ అవ్వారి శౌరి, కో–ఆర్డినేటర్ బుడుపుల పందు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఆగిరిపల్లి: అక్రమంగా నిల్వ ఉంచిన 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. ఆగిరిపల్లిలో సీతారామయ్య అనే వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు.

టీడీపీ కార్యాలయమా.. ప్రభుత్వాస్పత్రా?



మైలవరం: మైలవరం ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం పేరుతో ఈనెల 4న ఆస్పత్రి ప్రాంగణంలో ఒక కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ హాజరవుతున్న నేపథ్యంలో మైలవరానికి చెందిన టీడీపీ నాయకులు పోటీపడి భారీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. కార్యక్రమం పూర్తయి 12 రోజులవుతున్నా ఫ్లెక్సీలను తొలగించలేదు. ప్రభుత్వాస్పత్రి కాస్తా ఫ్లెక్సీలతో టీడీపీ కార్యాలయంగా దర్శనమిస్తోంది.

తుప్పలు, పొదల తొలగింపు

నూజివీడు: స్థానిక ఎంప్లాయీస్ కాలనీలోని ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, కంపల తొలగింపు పనులు శనివారం నిర్వహించారు. యజమానులు ఎక్కడెక్కడో ఉండడం, ఖాళీ స్థలాల్లో తుప్పలు, పొదల వల్ల పాములకు, విష పురుగులకు ఆవాసాలుగా మారాయి. దీంతో కాలనీ వాసులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్ పగడాల సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా మున్సిపాలిటీకి చెందిన జేసీబీతో తుప్పలు, పొదలను తొలగించారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ఆగిరిపల్లి: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రమాదాలకు గురిచేయవద్దని డ్రైవర్లకు ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. ఆగిరిపల్లిలో పరిమితి మించి ప్రయాణికులకు ఎక్కించుకు వెళ్తున్న ప్రయాణికులను దించి ఆటో డ్రైవర్లకు శనివారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు.

రైతు బజారు ఏర్పాటు కలేనా?

- ఆగిరిపల్లి ప్రజల ఎదురుచూపు
- గతంలోనే ప్రతిపాదనలు
- సమీప గ్రామాల్లోనే కూరగాయల సాగు
- దుకాణాల్లో అధిక ధరలకు కూరగాయల కొనుగోలుతో నష్టం



గతంలో రైతు బజార్ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదించిన మార్కెట్ యార్డ్ స్థలం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో రైతు బజార్ ఏర్పాటు మండల ప్రజలకు కలగానే మిగిలింది. మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో సుమారు 20 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఆగిరిపల్లితోపాటు మండలంలో 25 పంచాయతీలు, 12 శివారు గ్రామాలు కలిపి 70 వేల మంది వరకు ప్రజలు నివసిస్తున్నారు. ఈ గ్రామాల ప్రజలు ఆగిరిపల్లికి నిత్యం వచ్చి కూరగాయలు తీసుకెళుతుంటారు. ఆగిరిపల్లిలో కూరగాయల దుకాణాలు ఐదు మాత్రమే ఉండటంతో దుకాణదారులు చెప్పిన ధరకే కొనుగోలు చేయవలసిన పరిస్థితి నెలకొంది. విజయవాడ రైతు బజారుతో పోల్చితే ఇక్కడి దుకాణాల్లో కూరగాయలు కిలో రూ. 30 అదనంగా చెల్లించి వినియోగదారులు నష్టపోతున్నారు. సమీప గ్రామాల్లోనే కూరగాయలు సాగు చేసే రైతులు విజయవాడకు తీసుకువెళ్లి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. రవాణా చార్జీతోపాటు తక్కువ ధర రావడంతో రైతులు కూడా నష్టపోతున్నారు.

దుకాణదారుల ఇష్టారాజ్యం

కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో దుకాణదారులు వారి ఇష్టం వచ్చినట్లు ధరలను పెంచుతున్నారు. అదేమని దుకాణదారులను వినియోగదారులు అడిగితే మీకు ఇష్టం ఉంటే తీసుకోండి లేదంటే వదిలేయండి అని బదులిస్తుండటంతో చేసేది లేక వినియోగదారులు కూరగాయలు కొనుగోలు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

కిలోకు రూ. 30 వ్యత్యాసం

రైతు బజార్‌లో ఉన్న ధరలకు ఆగిరిపల్లి కూరగాయల దుకాణాల్లో అమ్ముతున్న ధరలకు రూ.30 వ్యత్యాసం ఉంటోంది. అదే రైతు బజార్ గ్రామంలో ఉంటే పేద, మధ్య తరగతి ప్రజలకు కొంత ఉపశమనం ఉంటుందని పలువురు చెబుతున్నారు. కొన్ని ఏళ్ల కిందట రైతు బజారును స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసేందుకు అధికారుల వద్ద ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. కానీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. రైతు బజారు ఏర్పడితే ఆగిరిపల్లి చుట్టుపక్కల గ్రామాల్లోని రైతులకు ఉపాధి కలిగే అవకాశం ఉంది.

సమీప గ్రామాల్లోనే కూరగాయల సాగు

మండలంలోని వట్టిగుడిపాడు, ఈదులగూడెం, సూరవరం, శోభనాపురం, చొప్పరమెట్ల, కొత్త ఈదర తదితర గ్రామాల్లో రైతులు కూరగాయలు పండిస్తున్నారు. ఇక్కడ రైతు బజార్ లేకపోవడంతో రైతులు వారు పండించిన పంటను విజయవాడకు తరలించి తక్కువ ధరకే విక్రయించి నష్టపోతున్నారు. అదే రైతు బజార్ ఉంటే ప్రజలకు ధరలు అందుబాటులో ఉండడమే కాకుండా రైతులు ఎక్కువ దూరం వెళ్లి తమ పంటలు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆగిరిపల్లిలో రైతు బజారును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విజయవాడ రైతు బజార్‌లో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో (రూపాయల్లో)
టమాటాలు	26
బంగాళాదుంపలు	28
వంకాయలు	24
దొండకాయలు	22
పచ్చిమిరపకాయలు	40
బెండకాయలు	20
కాకరకాయలు	32
కొత్తిమీర కట్ట	15

ఆగిరిపల్లి దుకాణాల్లో ధరలు

టమాటాలు	50
బంగాళా దుంపలు	60
వంకాయలు	60
దొండకాయలు	45
పచ్చిమిరపకాయలు	70
బెండకాయలు	40
కాకరకాయలు	60
కొత్తిమీర కట్ట	35



రైతు బజార్ ఏర్పాటు చేయండి



వారం వారం కూరగాయలకు రూ. 500 తీసుకెళ్లినా సంచిలోకి సరిపడా రావడం లేదు. విజయవాడ రైతు బజార్‌లో ధరలకు ఆగిరిపల్లిలో కూరగాయల దుకాణం ధరలకు రూ.30 వ్యత్యాసం ఉంటోంది. ప్రజల బాధలను గుర్తించి రైతు బజారు ఏర్పాటుకు కృషి చేయాలి.

– ఈలప్రోలు సుబ్బయ్య, ఈదులగూడెం

నేరుగా విక్రయించుకోవచ్చు



ఆగిరిపల్లిలో రైతు బజార్ ఏర్పాటు చేస్తే మేము పండించిన పంటను ఎటువంటి దళారులు లేకుండా నేరుగా ప్రజలకు విక్రయించుకోవచ్చు. వినియోగదారులకు కూడా నాణ్యమైన కూరగాయలు తక్కువ ధరకే అందించవచ్చు. ప్రభుత్వం రైతు బజారును ఏర్పాటు చేసి ఇక్కడి రైతులకు మేలు కలిగేలా చూడాలి.

– నాగరాజు, రైతు, సూరవరం

అప్రమత్తతతో రోడ్డు ప్రమాదాల నివారణ

సీఐ చంద్రశేఖర్

ఇబ్రహీంపట్నం: అప్రమత్తతతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని సీఐ ఎ.చంద్రశేఖర్ అన్నారు. ఇబ్రహీంపట్నం వీరాంజనేయ మినీ ట్రక్ వర్కర్స్, డ్రైవర్స్ యూనియన్ స్టాండ్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి ట్రక్‌లు తోలడం వలన ప్రమాదాలకు గురవుతారని చెప్పారు. విధి నిర్వహణలో ఇంటి వద్ద తమ కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారనే ఆలోచన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రక్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా సురేష్ వర్మ, కార్యదర్శిగా రాధాకృష్ణ, కోశాధికారిగా రాజేష్ తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

18వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): పదో తరగతి కామన్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 18వ తేదీ లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని కొత్తూరు తాడేపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎన్.కమలాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు రూ. 125 పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు రెండు సబ్జెక్టుల వరకు రూ. 110 చొప్పున ఫీజు చెల్లించి పరీక్షలు రాయవచ్చని, అంతకంటే ఎక్కువ సబ్జెక్టులున్న వారు రూ. 125 పరీక్ష ఫీజు చెల్లించాలని వివరించారు.

పోషణ్ వాటికలపై అవగాహన

నూజివీడు: నర్సరీల నుంచి నాణ్యమైన, మేలైన మొక్కలు, విత్తనాలను తెచ్చుకొని పోషణ్ వాటికలను ఏర్పాటు చేసుకోవాలని ఉద్యాన అధికారి ఆర్. హేమ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో శనివారం అంగన్‌వాడీ వర్కర్లకు పోషణ్ వాటికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మొక్కలను నాటే ముందు నేలను గుల్లగా చేసుకోవాలని, 15 సెంమీ ఎత్తులో మడులు ఏర్పాటు చేసుకొని నీడ లేని చోట నాటుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువులను వాడాలని, ప్రకృతి వ్యవసాయం నిర్వహణను పర్యవేక్షించే జడ్‌పీఎన్‌ఎఫ్ సిబ్బంది సూచనలు, సలహాలు తీసుకోవాలని చెప్పారు. సీడీపీఓ ఎస్వై నూరానీ మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలోని 163 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ వాటికలను ఏర్పాటు చేయాలన్నారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ముసునూరు: బలివే వెంకటాపురం, వేల్పుచర్ల గ్రామాల సరిహద్దులోని మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. నిందితుల నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు యనమదల విద్యార్థులు

నూజివీడు: యనమదల హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు త్రోబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎంఎస్ నాగరాజు శనివారం తెలిపారు. ఇటీవల గూడూరులో నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ త్రోబాల్ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులు జాజుల మనోజ్ కుమార్, నక్కా అజయ్‌బాబు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీ నాగేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ పలగాని శ్రీనివాసరావు, సర్పంచ్ వరికూటి వెంకటేశ్వరరావు అభినందించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు



నూజివీడు గ్రంథాలయంలో మాట్లాడుతున్న వరప్రసాదరావు



ఆగిరిపల్లిలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పెనుగొలనులో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నూజివీడు: సెల్‌ఫోన్లు పక్కన పెట్టి పుస్తకాన్ని పట్టుకుంటే విజ్ఞానం పెరుగుతుందని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఉపాధ్యాయుడు డి.వరప్రసాదరావు అన్నారు. స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ప్రముఖులచే ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, విద్యావంతులు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. అనంతరం 8,9,10 తరగతుల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయోద్యమం అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చందక రాజారామ్మోహన్‌రావు, ఉపాధ్యాయులు దారా మోహన్‌రావు, గ్రంథాలయాధికారి బీసీహెచ్ శ్రీనివాసరావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్లపల్లి గ్రంథాలయంలో...

గొల్లపల్లి గ్రంథాలయంలో ప్రముఖుల ప్రసంగాలు నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి మాట్లాడుతూ విద్యార్థులు సెలవు రోజుల్లోనైనా గ్రంథాలయాలకు వెళ్లడం అలవర్చుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దాని సాధనకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు, గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

■ చాట్రాయి: మండలంలోని చనుబండలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. శనివారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి శ్రీకాంత్, వెల్ఫేర్ అసిస్టెంట్ చారి పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు

విస్సన్నపేట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో స్వాతంత్య్ర ఉద్యమంలో గ్రంథాలయాల పాత్ర అంశం, సోషల్ మీడియా–విద్యార్థులపై ప్రభావం అంశంపై వ్యాస రచన పోటీలను శనివారం నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమంలో కృషి చేసిన వారి జీవిత విశేషాలను విద్యార్థులకు లైబ్రేరియన్ పి. భాను వివరించారు.

■ గంపలగూడెం: గంపలగూడెం, పెనుగొలను శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పెనుగొలనులో నేటి సమాజంలో గ్రంథాలయాల పాత్ర అంశంపై జూనియర్స్‌కు, డిజిటల్ గ్రంథాలయాలు, వాటి ఉపయోగాలు అంశంపై సీనియర్స్‌కి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల నివారణ అంశంపై జూనియర్, సీనియర్లకు డిబేట్ జరిగింది. ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ వి. వెంకట రెడ్డి, షిర్డీ సాయిబాబా సేవా కమిటీ సభ్యులు వి. నారాయణరావు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి మణిదీప్ గ్రంథాలయ ఉద్యమాన్ని వివరించారు. గంపలగూడెం గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, గ్రంథాలయాల వల్ల ఉపయోగం అంశంపై వ్యాసరచన పోటీలు, పలు ఆటల పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు జె. శ్రీలత, ఎస్ నాగేశ్వరరావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ ఆగిరిపల్లి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు స్థానిక గ్రంథాలయంలో శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రంథాలయ అధికారి నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు.

■ ముసునూరు: విద్యార్థుల్లో స్ఫూర్తి, పోటీతత్వానికి గ్రంథాలయాలే పునాది అని వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం గోపవరం గ్రంథాలయాధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్లకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాల ప్రాధాన్యతను ఉపాధ్యాయుడు శ్రీనివాస్ వివరించారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

500 భగవద్గీత పుస్తకాలు పంపిణీ

గంపలగూడెం: భగవద్గీత చూపిన మార్గం ప్రతి ఒక్కరూ పాటించాలని సమరసత సేవా ఫౌండేషన్ గంపలగూడెం మండల కన్వీనర్ వనమా సుజాత అన్నారు. గంపలగూడెం లిటిల్ ఏంజెల్ పబ్లిక్ స్కూల్లో 500 మంది విద్యార్థులకు శనివారం భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ భగవద్గీతలోని 18 అధ్యాయాల సారాంశంతో విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టీటీడీ ఈ పుస్తకాలను ముద్రించిందని వివరించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే భగవద్గీత విశిష్టత తెలుసుకుంటే మంచి నడవడిక ఏర్పడుతుందని చెప్పారు. సంస్థ ప్రతినిధులు బొడ్డు సత్య కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

ఇబ్రహీంపట్నం: జాతీయ పత్రికా దినోత్సవం ఇబ్రహీంపట్నంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ పాత్రికేయులు పి.గిరికుమార్, ఎం.నాగేశ్వరరావు కేక్ కట్ చేసి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పత్రికల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని సూచించారు. స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, ఏపీఎంపీఏ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్ ఖాద్రీ, సీనియర్ పాత్రికేయుడు డేవిడ్, వివిధ ప్రెస్‌క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

■ తిరువూరు: జాతీయ పత్రికా దినోత్సవాన్ని తిరువూరులో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అనాథాశ్రమాలలో రోగులకు, వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు, రొట్టెలను సంఘ నాయకులు పంపిణీ చేశారు. భగవాన్ రమణ మహర్షి ఆశ్రమం, అమ్మ ఆశ్రమం, దివ్యాంగుల సేవాశ్రమాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలపై కూటమి ప్రభుత్వం పన్నుల భారం

సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ విమర్శ

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెంచుకునేందుకు పేదలపై పన్నుల భారం మోపుతోందని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ విమర్శించారు. సీపీఎం తిరువూరు మండల మహాసభ మునుకుళ్లలో శనివారం జరిగింది. కృష్ణ మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసే వస్తువులపై ఒక శాతం అదనపు పన్ను విధింపునకు ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రిని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కాకుండానే విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ చార్జీలు మోపడంతో పేదవర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్, తిరువూరు మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

129 సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

నూజివీడు: డివిజన్ పరిధిలో 129 సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్డీఓ మొవిడి వాణి శనివారం తెలిపారు. వీటిలో మేజర్, మీడియం చెరువులకు సంబంధించి 23 సాగునీటి సంఘాలకు, మైనర్ చెరువులకు సంబంధించి 106 సాగునీటి సంఘాలకు ఉన్నాయన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించామని, వీరికి త్వరలోనే శిక్షణ ఉంటుందని చెప్పారు. మేజర్, మీడియం సాగునీటి సంఘాలకు ఒక్కొక్క దానిలో 12 టీసీలు, మైనర్ నీటి సంఘాలకు ఒక్కొక్క దానిలో ఆరు టీసీలు ఉంటాయన్నారు. టీసీలను రైతులు ఎన్నుకుంటారని, ఎన్నికైన టీసీలు సాగు నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని వివరించారు. ఈనెల 24 నాటికి సాగు నీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేస్తామన్నారు.

వర్క్‌షాప్‌లో సంఘ్ నేత రాఘవయ్య ప్రచారం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో యూనియన్ల గుర్తింపు ఎన్నికల ప్రచారం కోలాహలంగా జరిగింది. ఎన్ఎఫ్ఐఆర్, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో జరుగనున్న రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో రైలింజన్ గుర్తుకు ఓట్లు వేసి ఎంప్లాయీస్ సంఘ్‌ను గెలిపించాలని కార్మికులను ఆయన కోరారు. రైల్వేలో నూతన పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్) రద్దు చేయించి పాత పెన్షన్ విధానానికి సమానంగా ఏకీకృత పెన్షన్ విధానం (యూపీఎస్) అమలు చేయించేందుకు కృషి చేస్తామని, 8వ పే కమిషన్ త్వరగా ఏర్పాటు చేసేందుకు, కనీస వేతనం నెలకు రూ.32,500 వచ్చేలా పోరాటం చేస్తామని, నిలిపివేసిన డీఏ/డీఆర్ విడుదల, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ **'ఉల్లాస్' ద్వారా నిరక్షరాస్యులకు విద్య**

మైలవరం: నిరక్షరాస్యులైన పేద మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ అనూరాధ అన్నారు. మైలవరంలో వెలుగు సంస్థల సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని నిరక్షరాస్య మహిళలకు ఆరు నెలల పాటు పాఠాలు బోధిస్తామని చెప్పారు. ప్రతి రోజూ రెండు గంటల పాటు టీచర్స్ వారికి తరగతులు నిర్వహిస్తారన్నారు.

■ **315 మందికి వైద్య పరీక్షలు**

ముసునూరు: పేదలకు ఉచిత వైద్యం అభినందనీయమని జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్ అన్నారు. కల్వరి గాస్పెల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ తొమ్మండ్రు రూబెన్ ఆధ్వర్యంలో లోపూడి కల్వరి గాస్పెల్ చర్చి గ్రౌండ్‌లో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరుకు చెందిన ఆశ్రం, శంకర్ నేత్ర చికిత్సాలయం వైద్య బృందాలు 315 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. మెరుగైన వైద్యం కోసం 38 మందిని ఏలూరు ఆస్పత్రికి రిఫర్ చేశారు.

■ **పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి**

నూజివీడు: గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల భూమిని పేదలకు కేటాయించడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. నూజివీడు మండలంలోని గిరిజన గ్రామాలైన సిద్ధార్థ నగర్, లైన్‌తండా, హరిశ్చంద్ర తండా, కుక్కల తండా, ఓగిరాల తండా, కొత్తూరు తండా, హటియా తండాల్లో శనివారం ఆయన పర్యటించి మాట్లాడారు.

■ **సాగునీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ**

ముసునూరు: మండలంలోని ఆరు మేజర్, 16 మైనర్ ఇరిగేషన్ సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నామని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఎన్నికల నిర్వహణ, విధి విధానాలపై మాస్టర్ ట్రైనర్లు బి.వెంకటేశ్వరరావు, టి.యువరాజు అవగాహన కల్పించారు.

■ **సైబర్ నేరాలపై అప్రమత్తం**

విస్సన్నపేట: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. విస్సన్నపేటలోని బ్యాంకులను ఎస్ఐ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలకు సంబంధించి ఓటీపీలు ఎవ్వరికీ చెప్పరాదని, తెలియని ఖాతాలకు ఎలాంటి లావాదేవీలు చేయరాదని సూచించారు.

■ **గాయపడిన వ్యక్తి మృతి**

సొబ్బాల(గంపలగూడెం):గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్రమైన గాయం కాగా గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సొబ్బాలకు చెందిన వ్యక్తి శనివారం మృతిచెందాడు. ఎస్ఐ ఎస్. శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింతల శ్రీనివాసరావు(48) పొలంలో నూర్పిడి చేసిన వడ్లను గురువారం రాత్రి రోడ్డుపై ఆరబోసి ఆ రాత్రికి కాపలా ఉన్నాడు. అతను నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఒకటి వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో శ్రీనివాసరావు తలకు తీవ్రగాయమైంది. బాధితుడిని వెంటనే గుంటూరు ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

■ **నైపుణ్య శిక్షణపై అవగాహన ఒప్పందం**

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సిస్, విశాఖపట్నం పరస్పర ఉపాధి నైపుణ్య శిక్షణపై అవగాహన ఒప్పందం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ దీనిపై కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సిస్ సలహాదారు వై. రామ్మోహన్‌రావుతో అవగాహన పత్రాలను మార్చుకున్నామని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, ఆర్ అండ్ ఆర్ డీన్ డాక్టర్ ఎస్. పిచ్చిరెడ్డి, ఐ అండ్ ఆర్ డీన్ డాక్టర్ వి. సూర్యనారాయణ, ప్రోగ్రాం స్పోక్ కో–ఆర్డినేటర్స్ డాక్టర్ బి. రాంబాబు పాల్గొన్నారు.

■ **వనసమారాధన**

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కొన్నగుంట రోడ్డు లోని మామిడితోటలో శనివారం వనసమారాధన నిర్వహించారు. మహిళలకు, పురుషులకు నడక, పాటలు, మ్యూజికల్ చైర్, బెలూన్ బ్లాస్ట్, డిబేటింగ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.